సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

- సచివాలయ భవనం, ఆర్బీకే ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ


సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో సాకారం చేశారని ఎమ్మెల్యే వెంకటేగౌడ పునరుద్ఘాటించారు. మండలంలోని తోటకనుమ పంచాయతీలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గతంలో ప్రభుత్వ పథకాల కోసం అన్ని అర్హతలు ఉన్నా ప్రజలు అధికారులు చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం ఉండేది కాదన్నారు. జగనన్న పాలనలో ప్రజలు సచివాలయంలో దరఖాస్తు చేసిన 24 గంటల్లోనే పథకాల ఫలాలు ఇంటి ముంగిటకే ఇస్తున్నామన్నారు. అలాగే సమస్యలపై సచివాలయాల్లో అర్జీలు ఇస్తే అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తున్నట్టు చెప్పారు.

నమ్మక ద్రోహులను నమ్మొద్దు

టీడీపీ పాలనలో ప్రజలకు నమ్మక ద్రోహమే ఎదురైందని, మరోసారి ఆ నమ్మక ద్రోహులకు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జగనన్న పరిపాలను ఓర్వలేని చంద్రబాబు పని కట్టుకుని బురద చల్లుతున్నారని, దీనికి ఎల్లో మీడియా కూడా వంత పాడుతోందని విమర్శించారు. గతంలోఅధికారం అడ్డు పెట్టుని ప్రజల సొమ్మును టీడీపీ దోచుకుందని, జగనన్న పాలనలో కులమతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోందని, దీనిని ప్రజలు గుర్తెరిగి రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీలు లక్ష్మణ్‌రెడ్డి, తమీమ్‌ఖాన్, పార్టీ మండల కన్వీనర్ బాల గురునాథ్, మండల యువత అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆంజనేయులు, ఉప సర్పంచ్ అక్బల్, ఎంపీటీసీ అరుణాచలం, సర్పంచ్ భాగ్యమ్మ, నాయకులు లోకనాథ రెడ్డి, మాజీ సర్పంచ్ జనార్ధన రెడ్డి, మండల మహిళాధ్యక్షురాలు శశికళ, ఏఎంసీ డైరెక్టర్ వేణుగోపాల్, నాయకులు గోపినాథ్, జగదీశ్వర, మురళి, విశ్వనాథ్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తోడేళ్ల గుంపుపై సమరానికి 'సిద్ధం'


సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: టీడీపీ తోడేళ్ల గుంపుతో పోరాడడానికి తామంతా సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో కలసి శుక్రవారం ఆయన సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. గత ఎన్నికల్లో 600 హామీలను గుప్పించి జనాన్ని మోసం చేసినందుకే టీడీపీని ప్రజలు చిత్తుగా ఓడించారన్నారు. మళ్లీ ఎలాగైనా అధికారంలోకి రావాలని చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలకు తెరదీశారని విమర్శించారు. ఇప్పటికే జనసేన, కమ్యూనిస్టులు, అంతర్గతంగా కాంగ్రెస్, బీజేపీలతో పాటు పచ్చపత్రికలతో కలసి మళ్లీ ఒక ఛాన్స్ అంటూ అధైర్యపోరాటానికి సిద్ధమయ్యారని అపహాస్యం చేశారు. గత టీడీపీ పాలనలో సంక్షేమ పథకాల అమలు, పక్కాగృహాల మంజూరు, జన్మభూమి కమిటీలను.. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనను చూసి ఎవరు మంచి చేశారో పక్కాగా క్లారిటీతో ఉన్నారని, ఎన్నికల్లో వారు సరైన నిర్ణయం తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రంగన్న, రూరల్ కన్వీనర్ బాలాజీనాయుడు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు విశ్వనాథ్‌రెడ్డి, గంగమ్మ గుడి చైర్మన్ నరేష్, కౌన్సిలర్లు నాగరాజు, కుమార్, రహీంఖాన్, కోదండరామయ్య, రమేష్‌రెడ్డి, సర్పంచులు గోవిందస్వామి, తిరుమలేష్, అమరనాథ్‌రెడ్డి, మునిరత్నం, మనోజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

పలమనేరు: పట్టణ సమీపంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ(నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్) గుర్తింపు లభించినట్టు కళాశాల ప్రిన్సిపల్ మహమూద్ శుక్రవారం తెలిపారు. కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు రావాలనే కృతనిశ్చయంతో మెరుగైన సౌకర్యాలు, నాణ్యతా ప్రమాణాలతో విద్యాబోధన..ఇత్యాది వాటిని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ సంచాలకులు నాగరాణి కల్పించారని, ఈ నేపథ్యంలో గత ఏడాది డిసెంబర్‌లో ఎన్‌బీఏ నిపుణుల బృందం కళాశాలలోని సౌకర్యాలను పారామీటర్ల వారిగా పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి పంపిందన్నారు. అన్ని వసతులు బాగుండడంతో ఈ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపునిస్తూ శుక్రవారం ఉత్తర్వు లందినట్టు ఆయన తెలిపారు. దీంతో ఇక్కడి విద్యార్థినులకు ఉన్నత విద్య, ఉపాధిలో ప్రత్యేక అవకాశాలుంటాయని పేర్కొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయుల జయంతి


వేడుకలు నిర్వహిస్తున్న బలిజ సంఘం, కాప్‌రాక్స్ ప్రతినిధులు


పలమనేరు: శ్రీకృష్ణదేవరాయల విగ్రహ వార్షికోత్సవంలో బాస్ నేతలతో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పుంగనూరు: విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం, కాప్‌రాక్స్ ప్రతినిధులు అన్నారు. శుక్రవారం రాయల 553వ జయంతి వేడుకలను భీమగానిపల్లె వద్ద శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను ప్రస్తుతించారు. కాపు సంఘ నాయకులు నానబాల గణేష్, పూల త్యాగరాజు, డాక్టర్ ప్రభాకర్, ముత్యాలు, కుమార్, మనోహర్, బాలకుమార్ పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక మున్సిపల్ రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద శుక్రవారం బాస్(బలిజ సేవా సమితి) నాయకులు నిర్వహించారు. అలాగే ఈ విగ్రహాన్ని ఆవిష్కరించి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదానం, బైక్ ర్యాలీ కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరయ్యారు. బాస్ గౌరవాధ్యక్షుడు సుధాకర్, అధ్యక్షులు బాబు, కార్యదర్శి కిరణ్, గంగమ్మ గుడి చైర్మన్ కండల నరేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాగిపాళెం రవి, కౌన్సిలర్ హేమంత్, శివాలయ కమిటీ సభ్యులు హరీష్, రాజేష్, సీకే కిశోర్ పాల్గొన్నారు. ఇదే కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆకుల గజేంద్ర సైతం నిర్వహించారు. పలువురు బాస్ నాయకులు పాల్గొన్నారు.

కేంద్రం తీరుపై నిరసన


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు

పలమనేరు: రైతుల విషయంలో కేంద్రం వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని, వాటికి స్వస్తి పలకపోతే రైతాంగం ఆగ్రహం చవిచూడక తప్పదని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు సుబ్బారావు అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా స్థానిక రైతు సంఘ నేతలు పలమనేరులో శుక్రవారం మోటార్ సైకిళ్ల రాలీ నిర్వహించారు. మోదీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. సీపీఎం, సీఐటీయూ, ఐద్వా, ఏఐటీయూసీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపిక


అవార్డు అందుకుంటున్న జస్వంత్

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కావేటిగారిపల్లె హైస్కూల్ విద్యార్థి జస్వంత్ తయారు చేసిన కాయిన్ బేస్డ్ రేషన్ డిస్ట్రిబ్యూషన్ (నాణెం ద్వారా రేషన్ పంపిణీ) నమూనా ఇన్‌స్పైర్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మంజువాణి తెలిపారు. జిల్లాస్థాయి పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికైన నాలుగు నమూనాలలో ఒకటి తమ విద్యార్థిది కావడం ఆనందంగా ఉందన్నారు. యామర్రి మండలం మోర్దానపల్లె హైస్కూల్లో శుక్రవారం ఏడీ విజయేంద్రరావు, జిల్లా సైన్స్ అధికారి రమణ చేతుల మీదుగా తమ విద్యార్థి అవార్డు అందుకున్నట్లు ఆమె తెలిపారు.

'కస్తూర్బా' వార్షికోత్సవం


విద్యార్థినులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న సర్పంచ్ రాజప్ప

బైరెడ్డిపల్లె: మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం సరస్వతీదేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఓం ఆకారంలో రంగవల్లులు తీర్చిదిద్ది కొవ్వొత్తులు వెలిగించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ రాజప్ప మాట్లాడారు. దాతల సౌజన్యంతో విద్యార్థినులకు పెన్నులు, నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్‌ఓ స్వరూప, పాఠశాల కమిటీ చైర్మన్ సోమచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాయమాటలు నమ్మి మోసపోవద్దు


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెప్ప

పెద్దపంజాణి: ఎన్నికల ముందు లేనిపోని హామిలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా మాటతప్పిన చంద్రబాబును మరోసారి నమ్మి మోసపోవద్దని ఎంపీపీ రెడ్డెప్ప, మండల కన్వీనర్ బాగారెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని రాజుపల్లె సచివాలయ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. రానున్న ఎన్నికలు ఎంతో కీలకమైనవని, అందరూ కలిసికట్టుగా పనిచేసి మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. టీడీపీ పాలనలో చంద్రబాబు ప్రజలకు చేసిన వంచనను, ప్రస్తుతం జగనన్న పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు చాటిచెప్పాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి, మాజీ చైర్మన్ శంకరప్ప, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు రజారెడ్డి, శంకర్‌రెడ్డి, క్రిష్టప్ప, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

సదుం: మండలంలోని గొడ్లవారిపల్లె సమీపంలో 33/11 కేవీ సామర్థ్యంతో నూతనంగా నిర్మించనున్న సబ్‌స్టేషన్‌కు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ ఖాదర్ ఇలాహీ, లతీఫ్, ఎల్లారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పరిశీలించారు. మండలంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్ని చర్యలు తీసుకుంటున్నారని ఆయన పెద్దిరెడ్డి చెప్పారు.

18న క్షత్రియుల ఆత్మీయ సమావేశం

పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గంలోని క్షత్రియ కులస్తుల ఆత్మీయ సమావేశం ఈనెల 18న పుంగనూరులో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు భక్తవత్సలరాజు శుక్రవారం విలేకరులకు తెలిపారు. నియోజకవర్గంతో పాటు రామసముద్రం, పెద్దపంజాణి మండలాలకు చెందిన క్షత్రియ కుటుంబ సభ్యులందరూ పాల్గొనాలని కోరారు. భాస్కర్‌రాజు, లక్ష్మణ్‌రాజు, సుబ్రమణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా తిరునాళ్ల


ప్రత్యేకపూజలందుకున్న ఉత్సవమూర్తులు


ఉట్టి కొడుతున్న యువకులు

చౌడేపల్లె: మండలంలో చారాల గ్రామసమీపంలోని శ్రీ అన్నపూర్ణాంబ సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. రథ సప్తమి పురస్కరించుకుని ఏటా ఇక్కడ తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ సాంప్రదాయాల ప్రకారం పూజలు చేశారు. కోలాహలంగా నిర్వహించిన ఉట్లోత్సవంతో యువకులు పోటీ పడ్డారు. స్వామివారిని నంది వాహనంపై ఊరేగించారు. పేదలకు అన్నదానం చేశారు.

21న మండల సమావేశం

పుంగనూరు: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 21న ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. పలు అంశాలపై చర్చించేందుకు సభ్యులు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

భక్తిప్రపత్తులతో చక్రస్నానం


ప్రత్యేకపూజలందుకున్న ఉత్సవమూర్తి

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలో హరిమందిరం సమీపంలోని కోనేరులో శుక్రవారం భక్తిప్రపత్తులతో చక్రస్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు. హరి మందిరంలోని సీతా రామలక్ష్మణుల ఉత్సవమూర్తులను శేషవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. మేళతాళాలు, భక్త జన సందడి నడుమ ఆర్యవైశ్య సంఘం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

జిల్లా వీఆర్‌ఏల యూనియన్ అధ్యక్షుడిగా లక్ష్మణ్


లక్ష్మణ్ ఇర్ఫాన్

రొంపిచెర్ల: చిత్తూరు జిల్లా వీఆర్‌ఏల యూనియన్ అధ్యక్షుడుగా రొంపిచెర్ల మండల వీఆర్‌ఏ వై.లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎంపికై నట్లు రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు టి.అంజి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడుగా ఎస్.ఇర్ఫాన్ (రొంపిచెర్ల), జిల్లా కార్యదర్శిగా అజ్జల్ (పులిచెర్ల), జిల్లా వర్కింగ్ అధ్యక్షుడిగా వినాయకుడు (పెనుమూరు) ఎంపికయ్యారు. లక్ష్మణ్ మాట్లాడుతూ, వీఆర్‌ఏల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న పార్టీ నాయకులు

కుప్పం రూరల్: కుప్పం 9 వవార్డు కొత్తూరుకు చెందిన దివ్యాంగుడు చిన్నప్ప (58) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మరణించాడు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ మృతుని కుటుంబానికి రూ.10వేలను కౌన్సిలర్ హఫీజ్ ద్వారా అందజేశారు.

ప్రశాంతంగా కోడెదూడల పందేలు


పరుగులు తీస్తున్న కోడెదూడ

బైరెడ్డిపల్లె: మండలంలోని పిచ్చిగుండ్లపల్లెలో శుక్రవారం నిర్వహించిన కోడెదూడల పందేలు ప్రశాంతంగా ముగిశాయి. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి రైతులు తమ కోడెదూడలను తీసుకొచ్చి పరుగుపందెంలో వదిలారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని, కోడెదూడల పరుగు పందేలను తిలకించారు. ఈ సందర్భంగా పిచ్చిగుండ్లపల్లె జనసందోహంతో కిక్కిరిసింది. గెలుపొందిన కోడెదూడలకు నగదు బహుమతి అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు.

344 మందికి ఆరోగ్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

బైరెడ్డిపల్లె: మండలంలోని పాతపేటలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో 344 మంది గర్భవతులు, బాలింతలు, చిన్నపిల్లలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారులు కిజియారాణి, ప్రవీణ్‌కుమార్, శాలిని, సర్పంచులు మమత, రోజా పాల్గొన్నారు.

ఈరోజు

వలంటీర్లకు వందనం

పెద్దపంజాణి: మండల కేంద్రంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ అబ్దుల్ రహీం తెలిపారు. మండలంలో 283 మంది వలంటీర్లు ఉండగా, వీరిలో ఐదుగురికి సేవారత్న అవార్డు కింద రూ.30 వేలు, మిగిలిన వారికి సేవామిత్ర కింద రూ.15 వేల నగదు, ప్రశంసాపత్రాలు, శాలువలతో ఎమ్మెల్యే వెంకటేగౌడ చేతుల మీదుగా సన్మానించనున్నట్టు చెప్పారు.

పలమనేరులో..

పలమనేరు: మండలంలో శనివారం ఎమ్మెల్యే వెంకటేగౌడ పర్యటించనున్నట్టు ఎంపీడీఓ విద్యాసాగర్ తెలిపారు. ఉదయం 11.30 గంటలకు కూర్మాయిలో ఆర్‌బీకే, 12 గంటలకు కరిడిమడుగులో రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని, అలాగే మధ్యాహ్నం 3 గంటలకు తమ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తారని తెలియజేశారు.

రమణీయం...రథోత్సవం


పుంగనూరు: సూర్యప్రభ వాహనంపై స్వామివారు


బైరెడ్డిపల్లె: కార్వేటికొండపై నిర్వహిస్తున్న రథోత్సవం


గుడుపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలోని కార్వేటికొండపై నిర్వహిస్తున్న శ్రీ ధ్యానాభిరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం రమణీయంగా సాగింది. రంగు రంగుల పుష్పాలతో అలంకరించిన బ్రహ్మరథంపై సీతా రామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు ఆలయం చుట్టూ రథం లాగి ప్రదక్షిణలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

గంగవరంలో..

గంగవరం: మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు శుక్రువారం ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కోనేటిరాయుడు తిరుచ్చిపై విహరిస్తూ ఆలయం నుంచి కురప్పల్లెకు వేంచేశారు. స్వామి అమ్మవార్లకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి, కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఏటా రథసప్తమి రోజున శ్రీకోనేటిరాయస్వామిని తమ గ్రామానికి ఆహ్వానించి పూజలు చేయడం ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు. పూజల అనంతరం స్వామి వారు తిరిగి ఆలయానికి చేరుకున్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

పలమనేరు: రథసప్తమి పురస్కరించుకుని స్థానిక పాతపేట దుర్గా ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరయ్యారు. రాష్ట్ర ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన స్థానిక కౌన్సిలర్ కావడి నాగరాజ్‌ను ఎమ్మెల్యే, ఆలయ నిర్వాహకులు అభినందించారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహించారు. శ్రీవారిని సూర్యప్రభ వాహనంపై అలంకరించి ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు ఆధ్వర్యంలో భక్తులకు దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పలు ఆలయాల్లో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కల్లూరులోని చంద్రమౌళీశ్వర ఆలయంలో సూర్య భగవానునికి ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అర్చకులు పంపిణీ చేశారు.

సూర్య, చంద్రప్రభలపై కటాక్షించిన శ్రీనివాసుడు

గుడుపల్లె: రథ సప్తమి వేడుకలను మండలంలో కనమనపల్లెలోని శ్రీ పద్మావతి శ్రీనివాసస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం సూర్యప్రభ, మధ్యాహ్నం గరుడ వాహనంపై కొలువు దీరి, మంగళవాయిద్యాల హోరు నడుమ పుర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం ఉయ్యాల సేవలను నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.


గంగవరంలో..


పులిచెర్ల: కల్లూరులో..